# కనకాలు టీచరు

కొత్తగా ఆ ఊరు బదిలీఅయివచ్చిన వెంకట్రావు "ఇక్కడ ఇంటిదగ్గరలో ఆడపిల్లల స్కూలు ఉన్నదా?" అని తోటి ఉద్యోగిని అడిగాడు.

"లేకేం? ఆడపిల్లలస్కూలు మీ యింటికి రెండు ఫర్లాంగుల దూరంలో పదవక్లాసువరకుఉంది. మీ అబ్బాయికాలేజిలోనా స్కూల్లోనా చదవటం? ఇక్కడ మంచి కాలేజీలు రెండున్నాయి. అయితే అవి డిగ్రీకాలేజీలుకావు. అందుకు తగిన ప్రయత్నాలు జరుగుతున్నాయి" అన్నాడు.

''అబ్బాయి కాలేజిలోచేరాడు. అమ్మాయినే పదవక్లాసులో చేర్చాలి. ఇల్లు దొరికిన తరువాత సర్దటంలో తల్లికి సహాయంగా ఉండటంవల్ల వారం రోజులు ఆగవలసి వచ్చింది"

"సుకన్యా పాఠశాల అని దగ్గర్లోఉంది. నేను చెప్పినది ఈ పాఠశాలను గురించే. చాలామందిఅమ్మాయిలు నడిచేవెళ్తూఉంటారు. అక్కడ టీచింగ్ బాగుం టుంది. ప్రతిఏటా ప్యాసయిన పిల్లల శాతం అన్ని స్కూళ్లకంపె అధికంగా ఉంటుంది. అందుకే అందరూ తమతమ పిల్లలను దానిలోచేరుస్తారు. కాని, అందరూ అదే కావాలనటంవల్ల సీటు దొరకటం కష్టం. మీరు తొందరగా వెళ్లండి" అని సలహాయిచ్చాడు.

ఆ మరునాడే వెంకట్రావు కూతుర్ని తీసుకుని స్కూలుకు వెళ్లాడు. హెడ్‌మాస్టరికి సర్టిఫికెట్‌లుచూపించి, ఆయన అంగీకరించిన తరువాత, ఆఫీసులో లేట్‌ఫీజుకూడా కట్టాడు. అక్కడ దొరికిన పుస్తకాలు కొన్నాడు. ఆ రోజుకు అమ్మాయిని తనతో ఇంటికితీసుకువెళ్లి ఆమెకు కావలసిన పుస్తకాల లిస్టుప్రకారం బజారులోకొని, మరునాటినుంచీ స్కూలుకు వెళ్ళమని చెప్పాడు.

మరునాడు టిఫిన్‌డబ్బా పుస్తకాలసంచీ తీసుకుని రమణ స్కూలు వెళ్ళి క్లాసులో కూర్చుంది. ప్రతి క్లాసుకూ హాజరయింది. ఇంతలోకి ఇంటర్‌వల్ గంట

కొట్టారు. పిల్లలందరితోపాటు రమణకూడా క్లాసులోనుంచి బైటికివచ్చి లాన్‌లో కూర్చుని టిఫిన్‌డబ్బా తెరచే అంతలో బోదకాలుతో ఆడనౌకరు "కనకాలు టీచరు పిలుస్తున్నదని"చెప్పి ఆమె వచ్చేవరకూ నిలబడ్డది. రమణ టిఫిన్‌డబ్బా మూసి పక్కనఉన్న అమ్మాయిదగ్గర పెట్టి, ఆయాతోకూడా వెళ్ళింది.

కనకాలు టీచరు స్కూలుబిల్డింగువెనక ఉన్నగదిలో కుర్చీమీదకూర్చుంది.

రమణ వెళ్ళగానే "నమస్కారమండి" అని ఆమె కెదురుగా నిలబడ్డది.

''నీవు ఈ స్కూల్లోచేరి ఎన్నాళ్ళయింది?''

"మొన్న ఒకరోజువచ్చి హెడ్‌మాస్టర్ని కలుసుకున్నాము నేనూ మా నాన్న. నిన్నటిరోజునచేరి లేట్‌ఫీజుతోకూడా ఫీజుకట్టి, ఇంటికివెళ్ళిపోయాము. బజారులో పుస్తకాలు కొనుక్కున్న తరువాత ఇవాళ క్లాసుకువెళ్లాను'' అంది.

''కొత్తగా ఈ ఊరు వచ్చారా?''

"అవునండి. మా నాన్నకు ఈ ఊరు ట్రాన్స్ఫరయింది. మా నాన్న స్నేహితుడు "ఈ స్కూల్లో చేర్పించండి మంచి స్కూలు, అన్నారట. అందుకని ఇక్కడ చేర్పించాడు.''

''అయితే మొట్టమొదట కనకాలు టీచర్ని చూడవలసి ఉంటుందని ఎవరూ చెప్పలేదా?''

''మాకు ఎవరూ చెప్పలేదండి. మా నాన్న స్నేహితుడు చెప్పినట్టుగా హెడ్‌మాస్టరుగారి దగ్గరికివెళ్లాము'' కనకాలు టీచరు అడిగే పద్ధతిచూసి రమణకు చెమటలు పోశాయి.

''ఈ స్కూలు పద్ధతులేమిటో సీనియర్ ఆయా వెంకటమ్మను అడుగు చెబుతుంది. ఆమె పక్కగదిలోఉంటుంది వెళ్ళిఅడుగు" అన్నది అధికారస్వరంతో.

రమణ టిఫిన్‌డబ్బా తెచ్చుకున్నది కాని డబ్బామూత తెరవగానే ఆయా వచ్చిందని మూతపెట్టివచ్చింది. ఆయాతో మాట్లాడి మళ్ళీ కనకాలు టీచరు దగ్గర కొచ్చే వేళకు గంటకొడతారేమోనని భయంవేసింది అందులో తనుకొత్త.

''నేను ఇంకా టిఫిన్ తినలేదు. టిఫిన్ తినేసరికి గంటకొడతారేమో?

స్కూలుటైమ్ అయినతరువాత నేను ఆయానుకలిసి మాట్లాడి మీ దగ్గరికివస్తాను" అన్నది తడిఆరిపోయిన గొంతుతో.

"చూడమ్మాయీ! మాట తప్పావో ఇవాళ నీవు ఇంటికి వెళ్ళలేవు. తెలిసిందా?''

"సరేనండి. మీరు చెప్పినతరువాత రాకుండాఉంటానా? తప్పకుండా క్లాసులు కాగానే వస్తాను'' అని టిఫిన్ తినటానికి వెళ్ళింది.

ఆ స్కూలు రాణిసువర్చలాదేవి తన తల్లిపేరుమీద అరఎకరం భూమికొని భవనంకట్టించింది. భవనంపెద్దదయినా ముందు నాలుగుక్లాసులు పెట్టింది. నలుగురు టీచర్లను ఒక ఆయాను నియామకంచేసింది. ఆ నలుగురు టీచర్లలో ఒకరు పెద్ద పంతులమ్మగా పనిచేస్తూ క్లాసులు తీసుకునేవారు. ఆ నలుగురు టీచర్లలో కనకాలు టీచరు ఒకరు.

సంస్థానాలు, జాగీర్లు, జమీందారీలూ పోయినతరువాత, రాణి సువర్చలాదేవి ఆ పాఠశాలను ప్రభుత్వానికి అప్పగించింది. పెద్దస్థలమూ - పది క్లాసులవరకూ నడపటానికి అనువయిన భవనము-తగిన ఫర్నిచరూ సిద్ధంగాఉంది. ప్రభుత్వం ఆ భవనాన్ని సంతోషంతో స్వాధీనం చేసుకుని పది క్లాసులుపెట్టి టీచర్లను నియమించింది. ఒక ఆఫీసు-క్లర్కు టైపిస్టులతో ఒక వాచ్‌మన్ ఇద్దరు ప్యూన్లను పెట్టుకుని నడుపసాగింది.

తగిన అర్హతగల వాళ్లనే టీచర్లుగా నియమించింది ప్రభుత్వం. విద్యా అర్హతలు లేని పాతటీచర్లను తీసుకోలేదు.

ఆ ఆవరణంలో స్కూలు భవనం వెనకగా, మూడు గదులు స్కూలు ప్రారంభించినప్పుడు కట్టి, వాటిలో క్లాసులను నడుపుతూ ఉండేవారు. భవన నిర్మాణమయిన తరువాత ఆ గదులు ఖాళీగాఉన్నాయి.

కనకాలు టీచరు, ఆయా రాణీగారి దగ్గరికి వెళ్ళి ''అమ్మా, మా కొలువులు పోయాయి. మాకు దిక్కులేదు. మే మిద్దరం ఆ గదులలో ఉండటానికి అనుమతించమ''ని కాళ్ళమీద పడ్డారు.

"ఆ స్కూలుతో మీకు ఎలాటి సంబంధమూలేదు. ఊరికే కాపలాగా ఉంటా

రని హెడ్ మాస్టర్‌కి చెబుతాను. జాగ్రత్తగా మసలుకోండి. ప్రభుత్వంతో పని.''అని హెడ్‌మాస్టరుతోచెప్పి, ఒప్పించింది రాణీగారు. ఆయాకు బోదకాలు ఉండటం చేత ఆమెకూడా కనకాలు టీచరు పక్కగదిలో ఉంటున్నది.

రాణీగారి హయాములో కనకాలు టీచరు ఆ స్కూలు పెత్తనమంతా ఆయాను కూడగట్టుకునిచేసేది. ఇద్దరూ ఒకమాటమీద నిలబడేవారు. ప్రభుత్వం వారు స్కూలును స్వాధీనం చేసుకోవటంతో వాళ్ళకు ఇబ్బంది వచ్చింది.

చదువులేకపోయినా రాజ్యాలు ఏలేటంతటి తెలివితేటలు కొందరికి ఉంటా యన్న లోకసహజమైన మాటకు వాళ్ళిద్దరూ ప్రతీకులు.

వాచ్‌మన్ను మంచిచేసుకుని, ఆ స్కూల్లో చేరటానికి వచ్చిన ప్రతి విద్యార్థినీ ముందు కనకాలు టీచరు దగ్గరికివెళ్ళి, మర్యాదగామాట్లాడి ఆమెకు నూట పద హార్లూ, ఆయాకు ఏభయిరూపాయలూ సమర్పించుకోవాలి. ఆ తరువాతనే విద్యార్థి నులు స్కూలులో చేరాలి. అందుకు వాచ్‌మన్‌కి కొంతశాతము నెల నెలకు ముట్ట చెప్తూ ఉంటారు ఆ యిద్దరూ.

ఇది ఒక నియమంగా మారింది.

ఆ స్కూల్లో చేర్పించేవారందరూ "మంచి పేరుగల స్కూలు. టీచర్లు పాఠాలు బాగా చెబుతారు. అధికార యంత్రాంగంకూడా బాగుంది. పిల్లలు అధిక శాతంలో ప్యాసవుతున్నారన్న పేరువచ్చింది. ఆ స్కూల్లోనే మన పిల్లలను చేర్చుదామ"ను కుంటారు. అటువంటప్పుడు కనకాలు టీచరు ఆయాలకు డబ్బు ఇవ్వటానికి ఇంతవరకూ ఎవరూ శంకించలేదు. కాగా సంతోషంగా ఇస్తున్నారు. ఇది ఒక విధంగా ఏ బిల్డింగ్ బాగుచేయటానికో, పిల్లలకు ఆటలకు ఏర్పాటు చేయ టానికో ననుకుంటున్నారు.

ప్రతి సంవత్సరం కొత్త పిల్లలు చేరుతున్నారు. ఏదో ఒక క్లాసులో అంద రికీ కనకాలు టీచరు విధించిన సుంకంవసూలు వర్తిస్తునేఉంది

సుకన్యాపాఠశాల ప్రభుత్వాధీనమైన తరువాత కొన్ని సంవత్సరాలపాటు ఎటువంటి అవాంతరమూలేకుండా గడిచిపోయింది.

ఈ పద్ధతిలోకూడా కనకాలు టీచర్‌కీ ఆయాకు నెలకువచ్చేడబ్బు చాలటం లేదు. పైగా వచ్చేదానిలో వాచ్‌మన్‌కివాటా ఇవ్వటమంటే కష్టంగానే ఉంది. కొత్త

మార్గం కోసం ఆలోచిస్తున్నారిద్దరూ. వేసవి సెలవులువస్తే డబ్బుకు కట కట లాడుతున్నారు.

వేసవి సెలవుల తరువాత స్కూళ్ళుతెరిచారు. పిల్లలు స్కూల్లో చేరటానికి గుంపులుగుంపులుగా వస్తున్నారు. వాచ్‌మన్ జాగ్రత్తగా గేట్‌లోకివచ్చిన పిల్లలను ముందుగా కనకాలు టీచరు దగ్గరికి పంపిస్తున్నాడు.

''అమ్మాయీ. నీవు ఎవరిద్వారా ఈ స్కూల్లోచేరటానికి వచ్చావు?'' అడిగింది కనకాలు టీచరు ఒక అమ్మాయిని.

"ఎవరూ నన్ను తీసుకురాలేదండి. నాకుఎవరూ చెప్పనుకూడాలేదు. నేనొక్క దాన్నే కాదు మా స్నేహితురాలినికూడా తీసుకువచ్చాను ఈ స్కూల్లోచేరటానికి. ఎందుకంటే ఈ ఊరంతా చెప్పుకుంటారు-ఈ స్కూలే చాలా మంచిదని."అన్నది ఉత్సాహంతో.

''మంచిదని తెలుసుకున్నావు కదా. ఈ స్కూలుకు కొన్ని రూల్సు ఉన్నాయి. దీనిలో చేరటానికి వచ్చినవాళ్ళు ముందుగా ఇక్కడికి రావాలి. రెండు వందల పదహారు ఈ గదిలో చెల్లించాలి. పక్కగదిలో వంద రూపాయలు చెల్లించాలి. ఇక్కడిపని అయిన తరువాత హెడ్‌మాస్టరు గదిలోకి వెళ్ళాలి. ఆయన మీ సర్టిఫికెట్లు చూసి ఆమోదించిన తరువాతనే మీరు ఆఫీసుగదిలోకి వెళ్ళి ఫీజులు ఇంకా ఏమన్నాఉంటే అవీ కట్టి రసీదులు తీసుకోండి. కొన్ని పుస్తకాలు కూడా ఇక్కడ దొరుకుతాయి. కొనుక్కోవచ్చు'' అంది శ్రేయోభిలాషిలా, కనకాలు టీచరు.

అమ్మాయిలిద్దరూ బిత్తరపోయారు. ఇక్కడే మూడువందల పదహారు చెల్లించితే స్కూల్లో కట్టవలసిన ఫీజులకు డబ్బు తక్కువవుతుంది. ఇద్దరూ ఆలోచించుకుని ఆరోజుకి అక్కడ కట్టవలసిన డబ్బు మూడువందల పదహారూ కట్టేసి ఇంటికి వెళ్లారు.

"ఇంత డబ్బా ? ముందు మనం అట్లా అనుకోలేదే ? ఇప్పుడెట్లా ?" అన్నది ఒకమ్మాయి తల్లి.''

రెండో అమ్మాయి తల్లి ''ఇప్పటికే చేతిగాజులు రెండు తాకట్టు పెట్టాను. కానివ్వు, తెలుసుకోకుండా దిగినందుకు ఇదికూడా అనుభవించాలిగా! వేడిలో వేడి

నాన్నతో చెప్పి ఈ గాజులజతను కూడా తాకట్టుపెట్టిస్తాను. ఓ గంట ఆలస్యమవు తుంది, ఆగు" అన్నది.

మొదటి అమ్మాయి తల్లి కొడుకుల దగ్గర్నుంచీ కూతుళ్ళ దగ్గర్నుంచీ తీసుకుని అవసరమైన డబ్బు సమకూర్చింది.

తల్లులు పడుతున్న ఇబ్బందులు చూసి అమ్మాయిలిద్దరూ బాధపడ్డారు. బాధపడి వాళ్ళేంచేయగలరు. "మగపిల్లల కయినా ఇలా డబ్బు సర్దవలసిందేగా?" అని సమాధానపడి స్కూల్లో డబ్బుకట్టి చేరారు.

ఇప్పుడందరికీ తెలిసిపోయింది. సుకన్యా పాఠశాలలో ముందుగా రెండు చోట్ల డబ్బు కట్టినతరువాతనే హెడ్‌మాస్టరు దగ్గరికెళ్ళి మాట్లాడి చేరాలని, అందరూ ''ఇదొకరకంగా డొనేషన్ కట్టటమన్నమాట'' అనుకున్నారు.

ఒకసారి ఇద్దరాడపిల్లలు ఒక అమ్మాయి పదిహేనేళ్ళది, ఇంకొక అమ్మాయి పదేళ్ళది స్కూల్లో చేరటానికి వెళ్ళారు. వాచ్‌మన్ వాళ్ళను కనకాలు టీచరు దగ్గరికి పంపించాడు.

కనకాలు టీచరు వాళ్ళను చూడగానే కలిగిన సంతోషాన్ని పైకి కనబడ నీయకుండా "డబ్బు తెచ్చారా ?" అని అడిగింది.

"డబ్బేమిటి ? ఆఫీసులోకదా కట్టేది?'' అన్నది పదిహేనేళ్ల రాజేశ్వరి.

''ఇక్కడ డబ్బు కట్టినతరువాతనే అక్కడ ప్రవేశం కలుగుతుంది. ఆ అమ్మాయికూడా ఇంతేనా" అన్నది అదిరిపోయే కంఠస్వరంతో.

"హెడ్‌మాస్టరుగారు ఫోనుచేసి చెప్పినట్టుగా మేము వచ్చాము. మాకు ఇక్కడ డబ్బుకట్టాలని తెలియదు.'' రాజేశ్వరి తెలియదన్నమాట రెండోసారి అన్నది.

''అయితే ఇంటికి వెళ్ళండి'' అన్నది కనకాలు టీచరు.

"మేము ఇంటికి వెళ్ళటానికి రాలేదు. స్కూల్లో చేరాలని వచ్చాము. చేరి తీర్తాముగాని తిరిగి ఇంటికి వెళ్ళము" అన్నది పట్టుదలతో రాజేశ్వరి.

"అట్లాగా ? ఈ స్కూలుప్రారంభించి నప్పటినుంచీ నా మాటకు ఎదురు తిరిగిన పిల్లలను చూడలేదు'' అని ఆయాను పిలిచింది.

ఆయా బోదకాలు ఈడ్చుకుంటూ వచ్చింది.

''ఆయా, ఇంతకాలం నుంచి మన మాటకు ఎదురుతిరిగిన పిల్లలను మనం చూడలేదు. ఈ పిల్లలు "ఇక్కడెందుకు డబ్బుకట్టాలి" అంటున్నారు. ఏంచెయ్యాలో ఆలోచించు."

''అమ్మాయిలూ; ఇటురండి నా గదిముందరికి'' అన్నది ఆయా.

ఇద్దరూ వెళ్లారు.

''మీరు డబ్బు కట్టితీరాలి. కట్టని వాళ్ళకు ఇక్కడ పెద్ద శిక్షపడుతుంది. కనకాలు టీచరికి కోపంవస్తే ఎవరూ ఆపలేరు. మర్యాదగా డబ్బుకట్టండి"అన్నది.

''ఇక్కడెందుకు కట్టాలి? మానాన్న అడిగినప్పుడు హెడ్‌మాస్టరు ఇక్కడ డబ్బు కట్టాలని చెప్పలేదు."

''అట్లాగా? అయితే ఇటురండి'' అంటూ ఇద్దరినీ చేతులు పట్టుకుని లాక్కుపోయి ఆ మూడోగదిలోకి నెట్టి గొళ్ళెంపెట్టింది.

ఆ గది విరిగిపోయిన కుర్చీలు బల్లలు మొదలైన సామాన్లు పడేసే గది. ఆ గది తెరచి ఎంతకాలమయిందో? చీకటి, దుమ్ము, ఊపిరాడనట్టుగా ఉంది.

పిల్లలు అరిచారు, తలుపుపట్టి లాగారు, గట్టిగా కేకలుపెట్టారు. కాని ఆ కేకలు ఎవరికీ వినపడేటంత దగ్గరలో లేదు ఆ గది.

పిల్లలు ఏడ్చి, అరిచి, కేకలుపెట్టి, అలసిపోయారు. గదిలో వెంటిలేటర్ గాని కిటికీగాని లేదు. భయం, ఆదుర్దాతో పిల్లలు ఉండుండి కేకలుపెడుతున్నారు.

మధ్యాహ్నం అయింది. పిల్లలు స్కూల్లోచేరి ఇంటికి వెళ్ళి భోజనాలు చెయ్యాలని అనుకున్నారు. కడుపులో ఆకలి గిలగిల కొట్టుకునేటట్టు చేస్తున్నది. మళ్ళీ తలుపులాగారు, కొట్టారు, మళ్ళీఅరిచి కేకలుపెట్టారు.

సాయంత్రమయింది.

పిల్లలు ఇళ్ళకు కూడా వెళ్లారు. టీచర్లు వెళ్ళిపోయారు. తలుపులు తాళాలు వేసి నౌకర్లుకూడా వెళ్ళిపోయారు.

పిల్లలు ఏడ్చి ఏడ్చి ఒక మూలకు ఒరిగారు. నిద్రపట్టిందో లేక సొమ్మసిలి పడిపోయారో తెలియదు.

మరి, ఆ తరువాత చప్పుడు వినబడలేదు.

సాయంత్రము ఆఫీసునుంచి ఇంటికి వచ్చిన రాజేశ్వరి తండ్రి, "పిల్లలు ఇంకా ఇంటికి రాలేద''ని హెడ్‌మాస్టరు నడగాలని స్కూలుకు టెలిఫోను చేశాడు.

టెలిఫోను మోగుతున్నది కాని, ఎవరూ ఎత్తటం లేదు.

ఆయన ఇంటికి వెళ్ళిఉంటారని ఇంటికి చేశాడు.

''మీ అమ్మాయిలు స్కూలుకు రాలేదు. మీరు పంపిస్తామన్నారు గాని వాళ్ళు రాలేదు'' అన్నాడు హెడ్‌మాస్టరు.

''నేను పిల్లలకు డబ్బు ఇచ్చి మీ స్కూలుగేటువరకూ పంపించి వెళ్ళాను. అక్కడొక వాచ్‌మన్‌కూడా ఉన్నాడు'' అన్నాడు పిల్లలతండ్రి పరమేశ్వరరావు.

"మరి రాలేదే నాదగ్గరికి ?''

"ఇప్పుడేం చేద్దాం ? ఇద్దరు ఆడపిల్లలు ఏమయినట్టు?'' అన్నాడు కొంచెం కఠినంగా.

''నాకు తెలియదు కదండీ, వాచ్‌మన్ అక్కడే ఉంటాడు. పిల్లలు ఒకవేళ తిరిగి వెళ్ళిపోయినదీ లేనిదీ చెబుతాడు కనుక్కోండి" అన్నాడు హెడ్‌మాస్టరు.

''నేను వెళ్ళితే చూడలేదనో తనకు తెలియదనో చెప్తాడు. కనుక శ్రమ అనుకోకుండా మీరుకూడా రండి. మీ యిల్లు మాయింటికి పదిగజాల దూరంలో ఉంది. ఇద్దరం వెళ్దాం. అన్నట్టు పిల్లలు ఇంటికి రాలేదని మా అబ్బాయి పోలీసు రిపోర్టు కూడా ఇచ్చాడట, వాళ్ళకూడా స్కూలుదగ్గరికి వచ్చేఉంటారు''అన్నాడు.

పోలిసురిపోర్టు మాట వినగానే హెడ్‌మాస్టరు బయలుదేరి వచ్చాడు. అందరూ స్కూలుకు వెళ్లారు.

వాచ్‌మన్ వరెండాలో పక్కవేసుకుని పడుకున్నాడు. గేటు తలుపు కొట్టగానే లేచివచ్చి, గేటుతాళం తీసి హెడ్‌మాస్టర్ని చూసి భయంతో ఒణికిపోయాడు.

''ఏమయిందండీ, ఇప్పుడు వచ్చారు ?" అంటూ భయపడుతూ అడిగాడు. ఆయన చెప్పేటంతలో పోలీసుజీపు వచ్చింది.

పోలీసు ఇన్‌స్పెక్టరుతో సంగతంతా చెప్పాడు పిల్లలతండ్రి.

స్కూలు తాళపుచెవులు హెడ్‌మాస్టరు దగ్గర లేవు. ఇన్‌స్పెక్టరు చెప్పగానే తాళాలు పగలకొట్టి ఇద్దరు పోలీసులు క్లాసురూములు వెదకటం మొదలుపెట్టారు. మరొక ఇద్దరు బిల్డింగ్‌చుట్టూ టార్చిదీపం వేసి చూడటానికి బయలుదేరారు. అక్కడ వరసగా మూడుగదులున్నాయి. కనకాలు టీచరు తలుపుకొడితే ఆమె లేచి వచ్చింది.

''మీరెందుకొచ్చారు ?'' అన్నది భయపడుతూనే.

వాళ్ళు "ఇద్దరమ్మాయిలు కనబడలేదు. వెతుకుతున్నామని'' ఆమె గది చూశారు పరీక్షగా. రెండవపోలీసు ఆయా తలుపు కొట్టాడు. అతడు ఆయాతో మాట్లాడుతుండగా కనకాలు టీచరు గది సోదాచేసిన పోలీసు మూడవగది తలుపు తీసిచూశాడు. అది పనికిరాని సామాన్లుపడేసే గది. గాలి లేక వాసన వస్తున్నది. టార్చిలైటు వేసి చూడగానే ఇద్దరు అమ్మాయిలు ఒక మూలకు పడిఉన్నారు.

లేపగానే ఒక అమ్మాయి లేచింది ఏడుస్తూ, పెద్దమ్మాయి రాజేశ్వరి లేవ లేదు. నోట్లోనుంచి నురుగు వస్తున్నది.

ఇది చూసిన రెండవపోలీసు ఇన్‌స్పెక్టరుకూ తండ్రికీ అమ్మాయిలను చూపించటానికి తీసుకువచ్చాడు. చిన్నమ్మాయి తండ్రిని చూడగానే దగ్గరికొచ్చి ఏడ్చింది. పెద్దమ్మాయిని ఇద్దరు తీసుకువచ్చి స్కూలు వరండామీద పడుకో బెట్టారు.

"ఏదో కుట్టినట్టుందిసర్'' అని పోలీసు అనగానే కనకాలు టీచర్నీ ఆయాను పిలిచి అడిగాడు ఇన్‌స్పెక్టరు.

వాళ్లు మాకు తెలియదంటే తెలియదన్నారు. వాచ్‌మన్ తను అసలేచూడ లేదన్నాడు.

ఇన్‌స్పెక్టరు కనకాలు టీచర్ని ఆయాను పోలీసుస్టేషన్‌లో దింపి కస్టడీలో ఉంచి అమ్మాయిల తండ్రినీ పిల్లలనూ హాస్పిటల్ తీసుకువెళ్ళాడు.

డాక్టర్లు అమ్మాయిని పరీక్షచేసి చేతిమీద ఏదో కుట్టినట్టుగా ఉందని తగిన వైద్యం చేశారు గాని అమ్మాయి ప్రాణాలు ఎప్పుడో పోయాయని తెలుసుకున్నారు.

"పిల్లలను గదిలో పెట్టి గొళ్ళెం పెట్టిందెవరో మేము ఆడవాళ్ళచేత చెప్పిస్తామని'' పిల్లలనూ తండ్రినీ ఇంటిదగ్గరదింపి వెళ్లాడు ఇన్‌స్పెక్టరు. ఇదంతా జరిగే సరికి రాత్రి పదిగంటలు కావచ్చింది. ఆ యింటి వాళ్ళందరు చనిపోయిన అమ్మాయి ముందర కూర్చుని ఏడుపు ప్రారంభించారు.

అంతలో హాస్పిటల్‌నుంచి అంబులెన్సు వచ్చింది. "పోస్టుమార్టం చేయవలసిన కేసిది. మీరు ఇంటికెందుకు తీసుకువచ్చారంటూ అమ్మాయినీ తండ్రినీ తీసుకువెళ్ళారు.

పోస్టుమార్టమ్‌లో తెలిసిన విషయము ''ఇది పాముకాటనీ వెంటనే అయితే చికిత్స ఉన్నది గాని అమ్మాయి ప్రాణంపోయి చాలాసేపయింది. అది ఏ మధ్యాహ్నమో కరిచి ఉంటుందన్నారు."

తండ్రి కన్నీళ్ళుకారుస్తూ శవాన్ని ఇంటికి తీసుకు వచ్చాడు.

రెండవ అమ్మాయి కనకాలు టీచరు ఆయా తమను గదిలో పెట్టి గొళ్ళెం పెట్టారని చెప్పగానే వాళ్ళిద్దరి మీద కేసుపెట్టి విచారణ జరిగేవరకు జైలులో పెట్టారు. వాళ్ళమీద, డబ్బు అన్యాయంగా వసూలు చేస్తున్నందుకూ అమ్మాయి ప్రాణం పోవటానికి కారకులయినందుకూ ఇద్దరికీ పది సంవత్సరాలు కఠినకారాగార శిక్షపడ్డది. వాళ్ళతోకలిసి వాటా తీసుకుంటున్నందుకు వాచ్‌మన్‌కి రెండేళ్ళ శిక్షపడ్డది. హెడ్‌మాస్టర్‌కు ట్రాన్స్‌ఫర్ అయింది.

ఇది జరిగిన తరువాత కనకాలు టీచరు పేరు తలుచుకోనివారు లేరు. ఆ విధంగా ఆమె పేరు నలుగురి నోళ్లలో నానుతున్నది ఆ ఊరిలో. స్కూలులో అందరూ "ఇంక కనకాలు టీచరూ ఆయా లేరుగా." అనుకున్నారు తేలికపడిన హృదయాలతో.